# ప్రేమతో ....

కుర్చీలో కూర్చుని తల కొంచెంగా పైకెత్తి కళ్ళు మూసుకుని ఉన్న తల్లిని చూసి ఆ గదిలోకి వచ్చిన మహేంద్ర ఆశ్చర్యపోయాడు. ఆ వేళప్పుడు కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసుకుంటూనో లేకపోతే ఇంటిపనులు చక్కబెట్టుకుంటూనో హడావుడిగా ఉండే అమ్మ ఏదో ఆలోచిస్తూ, తను వచ్చిన సంగతి కూడా గమనించనంత పరధ్యానంగా ఎందుకుందో..?

తల్లి దగ్గరకు వెళ్ళి భుజంమీద చేయివేసి "ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్? ఏమైనా సమస్యా...?" అడిగాడు.

వినీల మెల్లగా కళ్ళు తెరిచింది.

"మహీ, నువ్వు చెప్పు... నేను ఎవర్ని?" మెల్లని స్వరంతో అడిగింది.

మహేంద్రకి నవ్వొచ్చింది. "చిన్నప్పుడు నువ్వు చెప్పిన కథలోని ఈగలా నువ్వూ నీ పేరు మర్చిపోయావా?" తమాషాగా అన్నాడు.

వినీల సీరియస్‌గా చూస్తూ "నేను అడిగింది ... నీకు ... నేను ..." అంది.

"అదేం పిచ్చిప్రశ్న" అంటూ చిన్నగా నవ్వాడు. "నువ్వు నాకు అమ్మవి ... బంగారు బొమ్మవి... పగడాల కొమ్మవి .. ఇంకా ఇంకా వర్ణించాలనుందిగానీ సరైన మాటలు తోచటం లేదు మరి" అల్లరిగా అన్నాడు.

ఆమెకి ఎదురుగా ఉన్న టేబుల్‌పై కూర్చుంటూ అక్కడున్న ఫైళ్లను పక్కకి జరుపుతూ యథాలాపంగా చూసిన అతను చటుక్కున వాటిని చేతులోకి తీసుకున్నాడు.

"రేవతీ ఇండస్ట్రీస్ ... రేవతీ ఇంటర్నేషనల్ స్కూల్ .. ఇదేమిటీ ఆవిడ పేర్లు పెట్టారూ?" విస్మయంగా చూశాడు. "ఈ సలహా నాన్నకి నువ్వే ఇచ్చావా?" అతని మాటల్లోకి పదును వచ్చింది.

వినీల లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపి "నాకూ ఈ విషయం ఇపుడు వీటిని చూశాకనే తెలిసింది. కనీసం నన్ను సలహా కూడా అడగలేదు" అంది బరువుగా నిట్టూరుస్తూ.

మహేంద్రకి అప్పటికి అర్థమైంది... తల్లి అలా ఎందుకుందో.

ఇదేమిటి, నాన్న ఇలా ఎందుకు చేశారు? బిజినెస్ మొదలు పెట్టగానే, తన ఆస్తిపాస్తులు పెట్టుబడి పెట్టాల్సివస్తుందేమో... ఆ బిజినెస్ ఎలా ఉంటుందో ... అనే భయాలతో చిన్న విషయాలకే నాన్నతో గొడవ పెట్టుకుని, కన్న మమకారం కూడా లేకుండా రెండేళ్ళ పసివాడినీ వదిలేసి విడాకులు తీసుకుని వెళ్లిపోయిన ఆవిడ పేరు... తాము ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ప్రాజెక్టులకు పెట్టడంలో తండ్రిఉద్దేశ్యం ఏమై ఉంటుంది? మహేంద్రకు అయోమయంగా అనిపించింది.

కొంచెం పక్కకు వెళ్ళి సెల్‌ఫోనులో మాట్లాడి మళ్ళీ వినీల దగ్గరకు వచ్చాడు. ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి అనునయంగా అన్నాడు. "నాన్నని గట్టిగానే అడిగాను. ఎవరినో కలవటానికి ఎక్కడికో వెళ్ళబోతున్నారట. ముందు ఇక్కడికి వస్తానని అన్నారు. ఏం చెబుతారో చూద్దాం. నేను మాత్రం దీనికి ఒప్పుకోను. నీ పేరే పెట్టాలని కచ్చితంగా చెబుతాను".

వినీల అతనివైపు చురుగ్గా చూసింది. "ఏం అంటున్నావ్ మహీ? నా పేరు పెట్టలేదని బాధపడుతున్నాననుకుంటున్నావా? ఛ.. ఛ... అదేం కాదు" అంటూ తల అడ్డంగా ఊపింది. "నన్నడిగి ఉంటే ... నీ పేరో, మీ నాన్న పేరో పెట్టమని చెప్పేదాన్నేమో! రేవతి .. ఆవిడొక ముగిసిపోయిన అధ్యాయమని నేను నమ్మాను. కానీ మీ నాన్న మనసులో ఆమెకింతటి స్థానముందని హఠాత్తుగా తెలిసేసరికి షాకయ్యానంతే! అందుకే, నీకయినా .. నేను అమ్మనా, లేక పిన్నినా... అని అనుమానం వచ్చి అడిగాను" కంఠం బొంగురుపోయింది.

మహేంద్ర మొహం పాలిపోయింది. ఏం మాట్లాడలేని వాడిలా ఒక నిముషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత మెల్లగా అన్నాడు. "నేను మాటలు నేర్చుకునే వయసునుండీ నిన్నే అమ్మగా పిలుస్తూ ... నీ ఒడిలోనే పెరిగాను. నాకు జన్మనిచ్చింది వేరొకరని .. ఆరు నెలల క్రితమే కదా నాకూ తెలిసింది. అంత మాత్రాన నువ్వలా అడగటమే నాకు చాలా అవమానంగా ఉందమ్మా" అతని గొంతూ గద్గదమైంది.

వినీల కళ్ళల్లోకి నీళ్లు వచ్చేశాయి . "ఛ.... నువ్వు బాధపడకురా. ఏవో పిచ్చి ఆలోచనలతో మనసు పాడై ... నిన్నలా అడిగా ... అంతే. నాకు తెలుసు... నేనే నీకు అమ్మనని. ఈ సంతృప్తి చాలు".

వినీల చెంపలమీదుగా జారిన కన్నీళ్ళను తుడిచి మహేంద్ర అక్కడేఉన్న సోఫాలో మౌనంగా కూర్చున్నాడు, తండ్రి రాకకోసం ఎదురు చూస్తూ. అవును, అతను మాత్రమే ఈ చిక్కుముడిని విప్పగలడు.

వినీల మళ్ళీ కళ్లు మూసుకని ఆలోచనల్లో మునిగిపోయింది.

పెళ్ళి ప్రపోజల్ తెచ్చినప్పుడు చైతన్య తనతో ఏమన్నాడు – 'పెద్దల ఇష్టప్రకారం రేవతిని పెళ్లి చేసుకున్నాగానీ తనకి భార్యగా నా మనసులో చోటు ఇచ్చాను. ఏ లోటు లేకుండా చూసుకున్నాను. అయినా నన్నూ సంసారాన్నీ కాలదన్ని వెళ్ళిపోయింది. ఇపుడు నేనిష్టపడిన అమ్మాయిని నా జీవితంలోకి ఆహ్వానించి నా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్నాను. నువ్వు కాదంటే, నా జీవితంలో ఇక పెళ్ళి ప్రసక్తే ఉండదు'. ఆ మాటల్లోని ప్రేమకు తను మైమరచిపోయింది.

పెళ్ళయిన కొత్తలో ఒకసారి భోజనాల సమయంలో – 'రేవతి వంటలు బాగా చేసేదా?' అని తను యథాలాపంగా అడిగిన ప్రశ్నకి అతనికెంత కోపం వచ్చిందో! 'వంటలు చేయటమే కాదు, అగ్గిపుల్ల అవసరం లేకుండానే మంటల్నీ పుట్టించగల సమర్థురాలు. రేవతినీ ఆమె జ్ఞాపకాల్నీ నా మనసులోంచి పూర్తిగా తుడిచేశాను. ఇంకెప్పుడూ నా దగ్గర తన గురించి మాట్లాడకు' ఆజ్ఞలా కఠినంగా చెప్పాడు. ఆ తర్వాత తను కూడా మళ్ళీ ఎప్పుడూ రేవతి ప్రస్తావన తేలేదు.

చైతన్య తోడిదే తన లోకమన్నట్లుగా బతికింది. అతని సహజీవనం తనకొక అపురూప వరం అనుకుంది. తన సొంత కూతురినైనా ఆ సంవత్సరం రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించిందిగానీ మహేంద్రని మాత్రం ఒక్కరోజు కూడా ఎప్పుడూ విడిచి ఉండలేదు. కాలేజీ స్టూడెంట్ అయినా ఇప్పటికీ చిన్నపిల్లాడిలా తన కొంగు పట్టుకుని తిరుగుతున్నట్లుగా ఇంట్లో తనవెంటే ఉంటాడు. అంతగా తన ప్రేమాభిమానాల్ని పంచి ఇచ్చింది. మహికి తల్లి కాగలగిందికానీ చైతన్య మనసులో స్థానం సంపాదించుకోలేకపోయిందన్న నిజం ఇప్పుడు కదా తెలిసింది! అతని మనసులో రేవతి మాత్రమే ఉందా..?!

వినీలకి దుఃఖం ఎగదన్నుకు వచ్చింది. తడి అయిన కళ్ళు తుడుచుకుంటూనే చైతన్య లోపలికి వచ్చిన అలికిడికి తలతిప్పి చూసింది.

సోఫాలో కూర్చున్న కొడుకు పక్కనే కూర్చుని చైతన్య చేతిలోని బ్రీఫ్‌కేసును ఒళ్ళో పెట్టుకున్నాడు. మహేంద్ర వెంటనే దాడి మొదలు పెట్టాడు.

"ఇపుడు చెప్పండి ... మీరు చేసిన పనికి అర్థమేమిటో, ఎలా సమర్థించుకుంటారో!" తండ్రి వైపు కోపంగా నిష్ఠూరంగా చూశాడు. "అయిదేళ్ళుగా ఈ ప్రాజెక్టుల కోసం మీరిద్దరూ ఎంతగా శ్రమపడ్డారో నాకు తెలుసు. మీ శక్తిసామర్థ్యాల కంటే అమ్మ కృషే ఎక్కువనే సంగతీ నాకు తెలుసు. అలాంటిది... మీరు ఈ ప్రాజెక్టులకు ఎవరో ఆవిడ పేరు..."

చైతన్య మధ్యలోనే అడ్డంవచ్చి "ఎవరో ఆవిడ అనకు. ఆమె నీ కన్నతల్లి" అన్నాడు. అతని కంఠం బరువుగా మారింది.

మహేంద్ర చివ్వున తలతిప్పి రోషంగా అన్నాడు. "మీరు ఇంకా ఆమెని భార్యగా అభిమానిస్తున్నారేమోగానీ నాకు మాత్రం ఎటువంటి బంధుత్వమూ లేదు. డబ్బు లెక్కలే ముఖ్యమనుకుని.... మాటలైనారాని పసివాడనే మమకారం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఆమె వెళ్లిపోయినా అమ్మ ఒడిలో అపురూపంగా పెరిగే అదృష్టం మాత్రం నాకు లభించింది. ఆమెని 'అమ్మ' అని పలకటానికే కాదు... ఆలోచనల్లో కూడా అంగీకరించను".

అతని మాటలకు వినీల మొహంలోకి వెలుగొచ్చింది. చైతన్యవైపు నిరసనగా చూసి ఏదో అనబోతుంటే "ఒక్కక్షణం నువ్వుండమ్మా" అంటూ మహేంద్ర చేయి చాపాడు. "నాన్నా, నావి చిన్నపిల్లాడి మాటలని కొట్టిపారెయ్యకండి. నేనూ మేజర్ని అయ్యాను. మంచీ చెడూ విచక్షణ తెలుసు. మీరు చేసిన పని నాకూ అమ్మకీ కూడా అవమానకరం. ఆ పేర్లు వెంటనే మార్చెయ్యండి" తనమాటే ఖచ్చితమన్నట్లుగా తండ్రితో అన్నాడు.

చైతన్య భారంగా నిట్టూర్చాడు. "నిజమే. నువ్వు మేజరువి అయ్యావు. ఏ విషయమైనా అర్థం చేసుకోగలవు కాబట్టి... నీకో విషయం చెబుతాను. ఆ తర్వాత మీరిద్దరూ చెప్పినట్లే చేస్తాను. నాకేం అభ్యంతరం లేదు. నాకు మూడునాలుగేళ్ళ క్రితమే తెలిసినా, మీకు అనవసరమైన ఆందోళన కలిగించటమెందుకనే ఉద్దేశ్యంతో చెప్పలేకపోయిన విషయం... ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి చెబుతాను" అన్నాడు.

"మా చిన్నాన్నగారి అమ్మాయి కల్పన మీకూ తెలుసుగా. తనూ రేవతీ క్లోజ్ ఫ్రెండ్స్. నాలుగేళ్ళు అవుతోందనుకుంటా... కల్పనని ఎవరో బంధువుల పెళ్ళిలో కలిశాను. రేవతి గురించి మాట్లాడబోతోంటే తన ప్రసక్తి నా దగ్గర తేవద్దంటూ కోపంగా మందలించాను. అప్పుడు కల్పన నాతో ఒకమాట అంది. 'ఆ మధ్య రేవతి నాకో ఉత్తరం రాసి, చదివాక చింపెయ్యమని అంది. ఎందుకోగానీ ఆ పని చేయలేక దాచి ఉంచాను. అది నీకు పోస్టు చేస్తాను. నువ్వు చదివి చింపెయ్యి' అని చెప్పింది. నేనూ చింపకుండా ఆఫీసులో నా పర్సనల్ లాకర్‌లో ఉంచేశాను. ఇప్పుడది తీసుకువచ్చాను. మీరూ చదివాక మీ నిర్ణయం చెప్పండి. నేను పని చూసుకుని కాసేపట్లో మళ్ళీ వస్తాను" అంటూ బ్రీఫ్‌కేసు తెరిచి ఒక కవరును తీసి మహేంద్ర చేతుల్లో పెట్టి చైతన్య చకచకా బయటకు వెళ్ళిపోయాడు.

వినీల, మహేంద్ర ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని ఒక్కసారిగానే ఆ ఉత్తరం చదివారు.

కల్పనా,

ఈ రోజు నీతో మాట్లాడి ఇంటికి వచ్చిన దగ్గర్నుంచీ ఎందుకోగానీ మనసు చాలా భారంగా ఉంది. నా మనసులోని మాటను కనీసం ఒక్కరికైనా చెప్పాలని ఇప్పుడనిపిస్తోంది.

అందుకే ఈ ఉత్తరం. అమ్మా నాన్నలతోనైనా చెప్పుకోలేని విషయాలు స్నేహితులతోనైనా పంచుకోగలుగుతాం... అవునా!

నాకు చాలా పొగరని నువ్వు కోప్పడ్డావు. నిజమే. ఇదేదో గొప్ప విషయం అన్నట్లుగా చెప్పుకోవటం కాదు. ...నిజాయితీగా నా బలహీనతని ఒప్పుకుంటున్నాను... అంతే. చిన్నప్పటి నుండీ ఇంట్లో వాళ్ళు చేసిన అతి గారబమే కారణమనుకుంటాను. అమ్మావాళ్ళే కాదు... అక్క, అన్నయ్య కూడా వాళ్ళ దగ్గరున్నది నేనడిగితే కాదనకుండా సంతోషంగా ఇచ్చేసేవాళ్ళు. ఇష్టమైనవాళ్ళకి మనకిష్టమైనదైనా ఇష్టంగా ఇవ్వటంలోనూ ఆనందం ఉంటుందని ఆ తర్వాత తెలిసిందిగానీ అప్పట్లో తెలియదు. నేనేదో స్పెషల్ అనుకునేదాన్ని.

కొంచెం పెద్దయ్యాక అర్థమైంది... అందరి కంటే చిన్నదాన్నని ఇంట్లోవాళ్లు గారాబం చేశారే తప్ప మామూలు అమ్మాయినేననీ. అయినా చిన్నప్పుడే నాలో వేళ్ళూనుకున్న పొగరు అలాగే ఉండిపోయిందనుకుంటా.

అమ్మానాన్నలు నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు నాకో ఆలోచన వచ్చింది. వాళ్ళెలాగూ మా ఆర్థిక స్తోమతకు సరితూగే సంబంధాలనే తీసుకువస్తారు. పెళ్ళి చూపుల్లో... నేను నచ్చలేదని ఎదుటివ్యక్తి తోసిపుచ్చే అవకాశమూ ఉంటుంది. అది నేను భరించలేను. అలాంటి సందర్భం రాకూడదని, మా ఇంటికి వచ్చిన నాన్నగారి స్నేహితుడి కొడుకు నాకు నచ్చాడనే విషయాన్ని అమ్మావాళ్ళకు పరోక్షంగా తెలియజేశాను. నా ఇష్టాన్ని వాళ్ళు కాదనలేరని తెలుసుకదా. మా ఇద్దరి పరిస్థితులను బట్టి పెళ్ళికొడుకుగా అతనికి... చదువు, ఉద్యోగం, అందం, తెలివితేటలు లెక్కలోకి తీసుకుంటే పదికి పది పడతాయిగానీ ఆర్థిక స్తోమతుకైతే పదికి మూడు మించవు. నాకైతే ఆర్థిక పరిస్థితికి పదికి పది మార్కులూ పడితే మిగతా విషయాలకు నాలుగైదు కంటే రావు.

అతని పెద్దవాళ్ళు 'పిల్ల మరీ తీసికట్టుగా లేదు, బాగానే ఉంది, ఈ పెళ్ళి చేసుకుంటే ఒక్కసారిగా నాలుగుమెట్లు ఎక్కేస్తావు. అంతస్తు పెరుగుతుంది' అంటూ పెళ్లికి ఒప్పిస్తారని నేను ఊహించాను. నాకు లోకజ్ఞానం బాగానే ఉందన్నమాట! నా అంచనా తప్పలేదు. చైతన్యతో నా పెళ్ళి జరిగింది. నన్నెవరైనా కాదనే సందర్భం రాకుండా అలా జాగ్రత్తపడ్డాను.

పెళ్ళికి చైతన్య ఏ కారణంతో ఒప్పుకున్నాగానీ అసంతృప్తి ఛాయలేవీ లేకుండా ఆనందంగానే కనిపించాడు.

పెళ్ళయ్యాక ఉద్యోగం మానేసి బిజినెస్ చేస్తానని అంటే నేనేం అభ్యంతరం చెప్పకుండా నా పేర ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న డబ్బులో కొంత ఇచ్చాను. జీవితం సాఫీగానే ఉంది. మూడేళ్ళకు మహీ పుట్టాడు. వాడంటే చైతన్యకు ఎంత ప్రాణమంటే .. ఇంట్లో ఉన్నప్పుడు వాడిని ఒక్క నిమిషమైనా వదిలేవాడు కాదు.

బిజినెస్‌ని ఇంకా పెంచే ఆలోచనతో చైతన్య బాగా కష్టపడుతున్నాడు. ఒకరోజు రాత్రి పది గంటల సమయంలో ఆఫీసు గదిలో ఏవో ఫైల్సు చూసుకుంటుంటే, ఇక పడుకోమని

చెప్పటానికి వెళ్ళాను. నేను పలకరించగానే 'ఇవన్నీ ఒకసారి చెక్ చేసెయ్యి వినీలా....' అనేసరికి ఆశ్చర్యపోతూ వినీల ఎవరని అడిగాను. తుళ్ళిపడి 'నేనింకా ఆఫీసులోనే ఉన్నాననుకున్నాలే...' అంటూ నవ్వి రెండు నెలల క్రితం తనకి పి.ఏ.గా చేరిన అమ్మాయని చెప్పాడు. చురుకుదనం, తెలివితేటలూ ఉన్న ఆ అమ్మాయి... ఎవరైనా నాలుగు నెలల సమయం తీసుకునే పనిని ఒక్క నెలలోనే పూర్తిచేయగలదని ప్రశంసించాడు.

'ఇలా ఇంట్లో పనిచేసుకునే సమయంలోనూ తను మీకు తోడుంటే బిజినెస్‌లో నాలుగు నెలలకి వచ్చే లాభాలు ఒక్క నెలకే వచ్చేస్తాయేమో' సరదాగా అన్నట్లుగా నేనన్న మాటల్ని చైతన్య కాదనలేదు. 'ఆఫీసులోనే కాకుండా ఇంటికి వచ్చి ఇప్పటివరకూ ఉండటానికి ఎలా వీలవుతుందీ... తనకీ పర్సనల్ లైఫ్ ఉండదా?" అన్నాడు.

ఇది నేనూహించని సమాధానం!

తన గురించి మాట్లాడుతున్నప్పుడు చైతన్య కళ్ళల్లో కనిపించిన మెరుపులు నా మనసును చివుక్కుమనపించాయి.

ఆ తర్వాత ఏవో పనులు కల్పించుకుని ఆఫీసుకు వెళ్లి వినీలను గమనించాను. అందమే కాదు... తన మాటల్లో, నవ్వులో ఎవరినైనా ఆకట్టుకునే ఆకర్షణా ఉంది. అందరితో చనువుగా, సరదాగా మాట్లాడినా ఎవరినీ హద్దులు దాటి తన పరిధిలోకి రానివ్వదనీ తెలుసుకున్నాను. వ్యక్తిత్వమూ విలువలూ ఉన్న ఆ అమ్మాయి ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహితుడైన చైతన్యతో హద్దుమీరే స్నేహానికి అంగీకరించదని నమ్మకమూ కలిగింది.

కానీ .. చైతన్యలోనే ఏదో మార్పు! నిరాసక్తంగా యాంత్రికంగా ఉంటున్నాడనిపించింది. వినీల ఆకర్షణ నుండి తట్టుకోవటానికీ, వైవాహిక బంధానికి కట్టుబడి ఉండాలనే నియమానికీ మధ్య నలిగిపోతున్నాడా .. ఈ అమ్మాయి నాకు ముందే ఎందుకు తటస్థపడలేదూ అని మథనపడుతన్నాడా ... అనే అనుమానాలు నన్ను చుట్టుముట్టాయి. కొన్నాళ్ళుపోతే విడాకులు అడుగుతాడేమోననే సందేహమూ కలిగింది. ఆ ఆలోచన రాగానే, నాలోని అహం నన్ను ఊరుకోనివ్వలేదు. ముందుగా నేనే ఆ పని చేయాలనే నిర్ణయానికి వచ్చేశాను. అవును, చైతన్య నన్ను విడాకులు అడగటాన్ని నేను తట్టుకోలేను.

ఎవరిలోనూ నూటికి నూరు శాతంగా అన్నీ మనకు నచ్చే మంచి లక్షణాలే ఉండవనే సంగతి అందరికీ తెలిసిందే! చైతన్యలోనూ నాకు నచ్చని చిన్న విషయాల్నే ఎంచి పట్టుకుని చిరాకు, అసహనంతో గొడవల్ని పెంచుకుని విడాకుల వరకూ సాగదీశాను. వ్యాపారంలో నా డబ్బు పెట్టుబడి పెట్టాల్సివస్తుందని భయపడుతున్నాననీ డబ్బు మనషిననీ చైతన్య నిందిస్తే మౌనంగానే భరించాను. సర్దుకుపోగలిగే చిన్న విషయాలకే రాద్ధాంతం చేసే మనిషి గురించి పాపం తను మాత్రం అంతకు మించి ఏం అనుకుంటాడూ...?

విడాకుల ఆలోచన నుండి నన్ను మళ్ళించటానికి చైతన్య చాలా ప్రయత్నమే చేశాడు. అందుకు కారణం నేను కాదు, మహీ మాత్రమే! నేను మనసు గట్టి చేసుకుని ఎప్పుడైతే మహీ తన దగ్గరే ఉంటాడని చెప్పానో అప్పుడిక అంగీకారసూచకంగా నిశ్శబ్దమై పోయాడు. నా నిర్ణయం స్థిరపడిపోయింది.

ఇక్కడ నాకున్న ఒక అలవాటు గురించీ చెప్పటం అవసరమనిపిస్తోంది.

ఒకసారి నేను కారులో వస్తూ ఒక కూల్‌డ్రింకు షాపు దగ్గర ఆగాను. ఆ సమయంలో పెద్ద గంపతో ఎక్కబోయిన పెద్దావిడను కండక్టరు కోప్పడుతూ ఆపేసి బస్సును ముందుకు పోనిచ్చేశాడు. నాకారులో ఎక్కించుకుని నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ళ పాక దగ్గర దింపినప్పుడు ఆమె ముఖంలో వెల్లువైన ఆశ్చర్యానందాల్ని చూడవలసిందే! ఇంటికి వచ్చి ఆకుకూరలమ్మే అవ్వ పాతచీర అడిగితే రెండు కొత్త చీరలు ఇవ్వటం... రోడ్డు పక్కన నిలబడి రూపాయో, అర్ధో అడిగినవాళ్ళకు వంద రూపాయలివ్వటం... ఇలాంటి పనులు తరచూ కాకపోయినా అప్పుడప్పుడూ చేయటం, వాళ్ల ఆశ్చర్యానందాల్ని చూడటం నాకిష్టం!

చైతన్యా నేనూ కోర్టుల చుట్టూ తిరిగేపని లేకుండా లాయరు దగ్గర పత్రాలు రాసుకుని విడిపోయాం. నాకు డబ్బుకేం లోటులేదుగా. వేరే వచ్చేశాను. అమ్మావాళ్ల దగ్గరకు వెళ్ళలేదు. బంగారంలాంటి సంసారాన్ని పొగరుతో వదిలేసుకున్నాననే సాధింపులు నిత్యమూ ఎదుర్కోవలసివస్తుందని!

మొదట బిజినెస్ కోసం నా దగ్గర తీసుకున్న డబ్బును చైతన్య రెట్టింపుగా నా పేర బ్యాంకులో వేశాడు. దానిని నేను మహీ పేర తర్వాత మార్చాను. చైతన్యకు మంచి పేరు ఉంది. ఎవరైనా పెట్టుబడి పెడతారు. ఆర్థికంగా పైస్థాయికి తొందరలోనే చేరుకుంటాడని నాకు తెలుసు.

నీకో విషయం చెబుతాను, నా చిన్నప్పుడు మేము అన్ని సౌకర్యాలూ ఉన్న చాలా పెద్ద ఇంట్లో అద్దెకుండేవాళ్ళం. ఇల్లు కట్టమని అమ్మ పోరుతుంటే ... బిజినెస్ పనులతో తీరికలేకనో అంత డబ్బు అప్పట్లో ఇంటిమీద పెట్టడం ఇష్టంలేకనో గానీ నాన్నగారు 'ఇంత మంచి ఇంట్లో సుఖంగా ఉన్నాం కదా' అనేవారు. అమ్మేమో 'సొంతం కానిది ఇంద్రభవనం అయితే మాత్రం ఎందుకూ, మనది అనుకునే ఇల్లు ఎంత చిన్నదైనా ఆ సంతృప్తీ, ఆనందం వేరు, మీకర్థం కాదుగానీ...' అంటూండేది.

చైతన్య మనసులో నేను కాకుండా ఇంకెవరో ఉన్నారనపించగానే ఇంద్రభవనంలాంటి సంసార జీవితాన్ని వదిలేసి, నాది అనుకునే చిన్న ఇల్లులాంటి ఒంటరి జీవితంలోకి ప్రవేశించాను. దీనిని ఎవరైనాసరే పిచ్చితనమో మూర్ఖత్వమో అనే అంటారు. నా మనసత్త్వాన్ని బట్టి ఆలోచిస్తేనే అర్థమౌతుంది.

కొన్ని విషయాల్లో నాకూ నాలెడ్జి బాగానే ఉందని మళ్ళీ రుజువైంది. నేనూహించినట్లుగానే మేం విడిపోయిన కొన్నాళ్ళకే చైతన్య వినీలను పెళ్ళి చేసుకున్నాడు. నచ్చిన అమ్మాయితో సహజీవనం, మహీ... నేనిచ్చిన ఈ రెండు కానుకలకీ చైతన్యలో ఆశ్చర్యానందాలు ఎలా వెల్లువై పొంగివుంటాయో ఊహించుకుని నేనూ సంతృప్తి చెందాను. నిజం!!

నేనేదో త్యాగం చేశానని అనుకోవటం లేదు. నా మనస్తత్వం ప్రకారం నాకు చేయాలనిపించింది చేశాను... అంతే ! చైతన్య మనసులోకి ఇంకెవరో అడుగుపెడుతున్నారని అనిపించగానే అతనితో కలిసి ఉండటం నాకిష్టం లేకపోయింది. కానీ నా మనసులో మాత్రం అతనిపట్ల ప్రేమ అలాగే ఉంది. అందుకే మళ్ళీ పెళ్ళి చేసుకోమని స్నేహితులు ఇచ్చిన సలహాని వినలేదు.

మహి నా దగ్గరుంటే తల్లి ప్రేమను మాత్రమే పొందగలుగుతాడు. వాడు అమ్మా నాన్నలిద్దరి మధ్యా అల్లారుముద్దుగా పెరగాలనే ఉద్దేశ్యంతో చైతన్య దగ్గిర వదలగలిగాను.

మహీ లేని లోటు పూడ్చుకోవటానికి మాత్రం నేను చాలా కష్టపడ్డాను. నాకెంతో అభిరుచి ఉన్న సంగీతంలో సాధన... స్నేహితులతో షికార్లు... ప్రయాణాలు.. ఏ సరదాలూ సంతృప్తినివ్వలేదు. అనాథశరణాలయం నుండి చిన్న పాపని తెచ్చుకున్నాక కొంత సాంత్వన కలిగింది. ఇంకో పది మంది పిల్లల ఆలనా పాలనా ఖర్చులన్నీ భరించే విధంగా దత్తత తీసుకున్నాను. అప్పుడప్పుడూ వాళ్ళందర్నీ ఇంటికి తీసుకువస్తుంటాను.

కన్నకొడుకును ఒక్కసారైనా కలుసుకోని కఠినాత్మురాలినని కదూ నువ్వు అన్నావ్...?

కల్పనా... నీకో విషయం చెప్పనా? మహీ ప్లేస్కూలుకు వెళ్ళటం దగ్గర్నుంచీ వాడు ఏ స్కూలు మారినా, నేను ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాను. యూనిఫామ్‌లో, బ్యాగు తగిలించుకుని, స్కూలు బస్సు దిగి స్కూలులోకి ముద్దుముద్దుగా నడుస్తూ వెళ్ళటాన్ని.. దూరంగా కారు దగ్గర నిలబడి చూడటం నా దినచర్య! మహీని చూస్తూ నా చేతుల్లోవున్న పాపను గుండెలకు హత్తుకుంటే, వాడిని దగ్గరకు తీసుకున్నట్లుగానే ఆనందం కలిగేది. ఏ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చాయి, ఏ ర్యాంకులో ఉంటున్నాడు.. ఇలాంటి విషయాలన్నీ తెలుసుకుంటూనే ఉన్నాను. తన పెరుగుదలను దూరం నుండే గమనిస్తూ సంతృప్తి పడుతున్నాను.

పెద్దవాడయ్యాక ఏ విషయం తెలిసినా ... ఫర్వాలేదుగానీ .. వినీల ఒడిలో తల్లిప్రేమను పొందుతూ పెరుగుతున్న పసివాడికి కనిపించి అనవసరమైన కలవరం కలిగించటమెందుకని నేనే కఠినమయ్యాను.

ఇంత వివరంగా రాసిన ఉత్తరం చదివాక అయినా.. కల్పనా... నీకు అర్థమయ్యానా? ఏమో, ఈ విషయంలో నాకు అనుమానంగానే ఉంది. ఎందుకంటే, సరిపడక విడాకులు తీసుకున్న వాళ్ళని చూసివుంటావుగానీ, ప్రేమిస్తూనే విడాకులిచ్చిన వాళ్ళ గురించి విని కూడా ఉండవు మరి! అవునా...?

ఇపుడు నా మనసు తేలికయింది. ఈ విషయాలన్నీ ఎవరికీ చెప్పకు. చదివిన వెంటనే ఈ ఉత్తరం చింపెయ్యటం మరిచిపోకు.

నీ స్నేహితురాలు

రేవతి

ఉత్తరం చదవటం ముగించిన మహేంద్ర, వినీల దిగ్భ్రాంతిలో మునిగిపోయారు.

వినీల కళ్లు మళ్ళీ ధారలుకట్టాయి... ఇప్పుడు ఇంకొక కారణంగా !

అప్పుడే లోపలకు వచ్చిన చైతన్య బరువెక్కిన మనసులతో విగ్రహాల్లా ఉన్న వాళ్ళకెదురుగా కూర్చుని నిదానంగా అడిగాడు. "ఈ ఉత్తరం చదివాక .. అన్నాళ్ళ తర్వాత చేయగలిగిందేమీ లేదు కనుక మిన్నకుండిపోయాను. ఇప్పుడు... రేవతి ఇచ్చిన కానుకలకు ప్రతిస్పందనగా నా అభిమానాన్ని చూపించే మార్గం ఇదేనని అనుకున్నాను. మీరిద్దరూ ఇప్పుడు చెప్పండి... పేర్లు మార్చెయ్యనా...?"

"వద్దు... వద్దు...." ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

"ఇప్పటివరకూ నాకు ఒక చెల్లి మాత్రమే అనుకున్నాను. పన్నెండుమందికి అన్నయ్యనని తెలిసి చాలా ఆనందంగా ఉంది. నాన్నా, ఒకసారి ఆ అమ్మనూ చూసి వస్తాను". మహేంద్ర ఉద్వేగంగా అన్నాడు.

'అమ్మ' అనే మాటను మహేంద్ర ఇష్టంగా పలకటాన్ని గమనించిన చైతన్య తేలికగా నిట్టూర్చాడు.

వినీల మహేంద్ర చేయి పట్టుకుని "మహీ... నువ్విప్పుడు... ఇద్దరు అమ్మలున్న అదృష్టవంతుడివి. వెళ్లిరా... అమ్మ ఆశీస్సులు తీసుకో..." ఆర్ద్రంగా అంది.

ఈనాడు ఆదివారం. 30, జనవరి 2011